## క్లుప్తంగా

### త్రైత సిద్ధాంత భగవద్గీతపై విస్తృత ప్రచారం



త్రైత సిద్ధాంత గ్రంథాలను పంపిణీ చేస్తున్న సమితి సభ్యులు

**ఎంవీపీ కాలనీ:** త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం త్రైత సిద్ధాంత–ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఇసుకతోట కూడలి, వెంకోజీపాలెంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా సమితి ప్రతినిధులు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్ గ్రహీత శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను పంపిణీ చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరం తెలియజేయడమే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశమని సమితి ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు త్రినాథరావు, కృష్ణ, సూరప్పుడు, సురేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### జూలో పర్యావరణ పరిరక్షణకు చర్యలు



జూలో ర్యాలీ చేస్తున్న యానిమల్ కీపర్లు

**ఆరిలోవ:** ఇందిరాగాంధీ జూ పార్కులో పర్యావరణ పరిరక్షణపై చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం జూలో యానిమల్ కీపర్లు మొక్కలు నాటారు. జూలో ప్రత్యేకంగా పలు రకాల మొక్కలు ఉత్పత్తి చేస్తున్నారు. ఆ మొక్కలనే జూలో పలు చోట్ల నాటించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ నందనీ సలారియా యానిమల్ కీపర్లకు అవగాహన కల్పించారు. పచ్చదనం, వన్యప్రాణుల సంరక్షణలో భాగస్వామ్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సమస్యలపై మేయర్‌కు వెంకోజీపాలెం వాసుల వినతి



మేయర్ హరివెంకటకుమారికి వినతి పత్రం అందిస్తున్న పాత వెంకోజీపాలెం గ్రామస్తులు

**మద్దిలపాలెం:** జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెం గ్రామానికి సంబంధించిన శ్మశాన వాటికకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ సోమవారం స్పందన కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. అలాగే హెచ్‌బీ కాలనీ నుంచి పాత వెంకోజీపాలెం జాతీయ రహదారి వరకూ ఉన్న డబుల్ రోడ్డును విస్తరించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని వారు కోరారు. యల్లమాంబ కాలనీ వద్ద ఓ ప్రైవేట్ వ్యక్తికి సంబంధించిన స్థలం విషయంలో కోర్టులో కేసు కారణంగా రోడ్డు విస్తరణ నోచుకోవడం లేదని వారు వివరించారు. ఈ సమస్య పరిష్కారానికి రోడ్డు విస్తరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

### ఎన్‌యూజే–ఐ నిర్వాహక కార్యదర్శిగా ఎన్ఎన్ఆర్

**బీచ్ రోడ్డు:** నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్–ఇండియా (ఎన్‌యూజే–ఐ) నిర్వాహక కార్యదర్శిగా సీనియర్ జర్నలిస్ట్ ఎన్.నాగేశ్వరరావు (ఎన్ఎన్ఆర్) నియమితులయ్యారు. ఈ మేరకు యూనియన్ సెక్రటరీ జనరల్ సురేష్ శర్మ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో యూనియన్‌లో చురుగ్గా సేవలందిస్తున్న ఎన్ఎన్ఆర్ నిర్వాహక కార్యదర్శిగా నియమితులు కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



# టీటీడీ ఈ–బుకింగ్ సేవలకు ఎదురుచూపులు

- కోవిడ్ కారణంగా మూతపడిన ఎంవీపీ ఈ–దర్శన కౌంటర్
- రెండున్నరేళ్లుగా తెరుచుకోని వైనం



టీటీడీ దర్శన టికెట్ల కోసం ఎంవీపీ కాలనీలోని సెంటర్ ఎదుట బారులు తీరిన భక్తులు (ఫైల్)

**ఎంవీపీ కాలనీ:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులకు అవస్థలు తప్పడం లేదు. కోవిడ్ కారణంగా మూతపడిన ఎంవీపీ కాలనీలోని ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సెంటర్ పునః ప్రారంభం కోసం ఎదురుచూపులే మిగులుతున్నాయి. శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ కేంద్రాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ఎంవీపీ కేంద్రంగా దశాబ్దాల క్రితం అందుబాటులోకి తెచ్చింది. అయితే ఈ సేవలు కోవిడ్ కారణంగా నిలిచిపోయాయి. కోవిడ్ అనంతరం ఆన్‌లైన్ టికెట్ విక్రయాలను టీటీడీ ప్రారంభించినప్పటికీ ఈ సెంటర్ సేవలను పునరుద్ధరించలేదు. భక్తులకు గతంలో విలువైన సేవలు అందించిన ఈ సెంటర్ కార్యకలాపాల పునఃప్రారంభం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

**గతంలో సేవలు ఇలా..**

వెంకన్న దర్శనానికి సంబంధించి టికెట్ విక్రయాలు నెల రోజుల ముందుగానే ఇక్కడ జరిగేవి. టీటీడీ మార్గదర్శకాలకు అనుగుణంగా వారు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నెల రోజులు ముందుగానే ఆయా తేదీల్లో దర్శన టికెట్లను విక్రయించేవారు. దీంతో పాటు తిరుమల కొండపైన, కొండ దిగువన భక్తుల ఆసక్తికి అనుగుణంగా గదులు సైతం బుక్ చేసేవారు. రూ.300, రూ.600 టికెట్ల విక్రయాలు నిత్యం ఇక్కడ జరిగేవి. దీంతో పాటు ఆర్జిత సేవలైన శ్రీవారి కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, వసంతోత్సవం, సహస్ర దీపాలంకరణ, విశేష పూజ టికెట్లు కూడా విక్రయించేవారు.

భక్తు లు కేవలం ఆధార్ కార్డు జిరాక్స్‌లు, డబ్బులు చెల్లించి ఆయా సేవలు పొందేవారు. ఇప్పుడు ఈ సేవల న్నీ నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితిల్లో ప్రైవేట్ నెట్ సెంటర్లను ఆశ్రయించి దర్శన టికెట్లను బుక్ చేసుకుంటుండడంతో భక్తులపై ఆర్థిక భారం పడుతోంది.

**రెండున్నరేళ్లుగా ఇబ్బందులు**

కోవిడ్ కారణంగా రెండున్నరేళ్ల క్రితం నిలిపివేసిన ఎంవీపీ ఈ–దర్శన టికెట్ కౌంటర్‌ను పునరుద్ధరించకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. దర్శన టికెట్ల కోసం పెద్ద ఎత్తున ప్రైవేట్ బుకింగ్ సెంటర్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అయినా టికెట్లు లభించడం లేదు. సమయానికి టికెట్లు దొరకకపోవడంతో పాటు అదనంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో విడుదల చేసిన గంటల వ్యవధిలోనే దర్శన టికెట్లు అయిపోతున్నాయి. ఈ నేపథ్యంలో టీటీడీ ఉన్నత ఆశయంతో అందుబాటులోకి తెచ్చిన ఎంవీపీ కాలనీ ఆన్‌లైన్ సెంటర్ సేవలను పునరుద్ధరించాలని కోరుతున్నాం.

– పి.గురుమూర్తి, ఎంవీపీ కాలనీ

**ఈ–దర్శన టికెట్ కౌంటర్ పునరుద్ధరించాలి**

భక్తులకు ఈ–దర్శన టికెట్ కౌంటర్ సేవలు ఎంతో ఉపయుక్తంగా ఉండేవి. దర్శన టికెట్లు ముందుగానే పొందడం ద్వారా రైల్వే, బస్సుల ద్వారా వెళ్లే వారు ప్రయాణ టికెట్లను అనుకున్న తేదీల్లో సులభంగా పొందేవారు. ఆన్‌లైన్ టికెట్లు బుకింగ్‌పై అవగాహన లేని భక్తులకు సైతం ఇక్కడి సిబ్బంది విశిష్ట సేవలు అందించేవారు. దీంతో ఈ సెంటర్‌కు విశేష ఆదరణ లభించింది. ఇప్పటికైనా ఈ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించాలని టీటీడీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

– సత్యకుమార్, ఎంవీపీ కాలనీ

# సీఎం జగన్‌తోనే శెట్టిబలిజలకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య వివేకానందమూర్తి

**ఎంవీపీ కాలనీ:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న చైతన్యవంతమైన పాలనతోనే శెట్టిబలిజ సామాజిక వర్గానికి సముచిత గుర్తింపు లభించిందని ఏయూ పూర్వ ఆచార్యుడు, జిల్లా శెట్టిబలిజ సంఘం ముఖ్య సలహాదారుడు ఆచార్య వివేకానంద మూర్తి అన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన శెట్టిబలిజ నాయకులకు ముఖ్యమంత్రి జగన్ రాజకీయ ప్రాధాన్యం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం లాసన్స్‌బే కాలనీలో జిల్లా శెట్టిబలిజ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వైఎస్సార్‌సీపీ రెండు ఎమ్మెల్సీ పదవులను శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన కుడిపూడి సూర్యనారాయణ, కవురు శ్రీనివాస్‌లకు కేటాయించిందన్నారు. ఇందుకు శెట్టిబలిజ సంఘం తరపున ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు వెల్లడించారు. గతంలో శెట్టిబలిజలను ఓటు బ్యాంకుగా మాత్రమే కొన్ని పార్టీలు వాడుకున్నాయని విమర్శించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గుత్తుల మధుసూదనరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఉత్తరాంధ్రకు చెందిన శెట్టిబలిజలకు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్, డాక్టర్ వెంకట్‌నాయుడు, కె.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రెజ్లర్ల పోరాటానికి ‘అరుణోదయ’ సంఘీభావం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు

**ఏయూ క్యాంపస్:** మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఆల్ ఇండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని అరుణోదయ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. మహిళా రెజ్లర్ల న్యాయమైన పోరాటానికి తమ సంఘీభావం ప్రకటించింది. సోమవారం ఆంధ్రా యూనివర్సిటీ ప్లాటినం గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు సి.నాగరాజు అధ్యక్షత వహించారు. అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ పలు కీలక తీర్మానాలు ప్రవేశపెట్టారు. మద్యం తయారీని, అమ్మకాలను రద్దు చేయాలని, ప్రజాస్వామికవాదులు, ప్రజా కళాకారులు, రచయితలు, మేధావులు, జర్నలిస్టులపై ప్రభుత్వాలు పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని తీర్మానించారు. అటవీ సంరక్షణ చట్టం నిబంధనలు–2022ను ఉపసంహరించుకోవాలన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్లుగా మార్చిన కేంద్ర ప్రభుత్వం వెంటనే తిరిగి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అరుణోదయ రాష్ట్ర ఆఫీసు బేరర్లు కాకర్ల అప్పారావు, కె.నిర్మల, ఎస్.జయలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.అప్పలసూరి, ఏడుకొండలు, చంద్రప్ప, రామమూర్తి, ప్రతాప్, ముక్కారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జోన్–2 ‘స్పందన’కు 14 అర్జీలు




జెడ్సీ కనకమహాలక్ష్మికి సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

**మధురవాడ:** జీవీఎంసీ జోన్–2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి 14 వినతులు స్వీకరించారు. రహదారులు, మురుగు కాల్వలపై ఆక్రమణలు తొలగించి రోడ్లు విస్తరించాలని మధురవాడ శ్రీసాయి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కి చెందిన ఎం.వెంకటరావు తదితరులు కోరారు. ఎండాడ సిగ్నల్ వద్ద గల చెరువుపై లైట్లు వెలిగించి, హద్దులు గుర్తించాలని, పూడిక తొలగింపునకు చర్యలు చేపట్టాలని, రహదారిలో ఆక్రమణలు తొలగించి విస్తరించాలని ఎండాడ శ్రీ పోలమాంబ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూధన రెడ్డి తదితరులు విన్నవించారు. పరదేశిపాలెం జేఎస్ఎన్‌యూఆర్ఎం పీపీ–1 కాలనీకి బోయిపాలెం 40 అడుగుల రోడ్డు నుంచి తన భూమిలో రహదారి నిర్మించాలని వి.నాగేశ్వరరావు వినతిపత్రం అందించారు. ఎంవీవీ సిటీ వద్ద మెయిన్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఎంవీవీ సిటీ ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు. క్రికెట్ స్టేడియం నుంచి బింద్రానగర్ వరకు ప్రవహిస్తున్న డ్రైనేజీ పూడిక తీయడానికి చర్యలు చేపట్టాలని షిప్‌యార్డు లేఅవుట్ బింద్రానగర్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన ఏఎం ప్రసాద్ తదితరులు విజ్ఞప్తి చేశారు. నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు మధురవాడకే మొదటిదని, పూర్తి స్థాయిలో బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని రవికుమార్ తదితరులు కోరారు. స్వతంత్రనగర్‌లోని హుద్‌హుద్ కాలనీకి తాగునీటి సౌకర్యం కల్పించాలని నివాసులు వి.ఎల్లమ్మనాయుడు తదితరులు కోరారు. రోడ్డుపై దుకాణాలు తొలగించొద్దని రైతుబజార్ రోడ్డులో చిల్లర వ్యాపారులు కోరారు. వీటిపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ కనకమహాలక్ష్మి హామీ ఇచ్చారు.

# కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాలి

**ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ**



830వ రోజు ఉక్కు దీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

**కూర్మన్నపాలెం:** దేశంలో ఉన్న పరిశ్రమలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించకుండా ప్రభుత్వరంగ సంస్థలుగా నడిపేలా కార్మికులు తమ పోరాటాల ద్వారా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చ్ వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 830వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు కూర్చుని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ కంపెనీలకు తాకట్టు పెడుతూ, విదేశాల నుంచి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల్ని మోసం చేయడం సరికాదన్నారు. కార్మికుల బలిదానాలతో సిద్ధించిన పరిశ్రమలను కాపాడుకుంటే, దేశానికి మేలు చేసినట్లేనన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## హెచ్‌బీ కాలనీలో స్టాండింగ్ కౌన్సిల్ కార్యాలయం



గిరిబాబును అభినందిస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, మొల్లి అప్పారావు

**మద్దిలపాలెం:** జీవీఎంసీ జోన్–3 మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు అప్పారి గిరిబాబు తన కార్యాలయాన్ని హెచ్‌బీ కాలనీలో ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిబాబుకు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గిరిబాబు మాట్లాడుతూ జోన్–3 పరిధిలో అందరికి అందుబాటులో ఉండేందుకు హెచ్‌బీ కాలనీలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు.

## అప్పుల బాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

**పీఎం పాలెం:** చేసిన అప్పులు తీర్చలేనేమో అన్న బెంగతో ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం లా–అండ్ ఆర్డర్ ఎస్ఐ సోమరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధురవాడ గణేష్‌నగర్‌లో కుటుంబంతో నివసిస్తున్న పప్పల రామమోహన్‌రావు ఆటో డ్రైవరు. తన ఆటోలో ప్రయాణికుల రవాణాతో పాటు షాపులకు వాటర్ బాటిళ్లు వేస్తుంటాడు. భార్య రమణి ఇద్దరు పిల్లలను తీసుకుని శనివారం ఆరిలోవలో నివసిస్తున్న తమ్ముడి వివాహ శుభకార్యానికి వెళ్లింది. ఆరోజు సాయంత్రం 7 గంటలకు తల్లి వడ్డించగా భోజనం చేసి తనగదిలోకి వెళ్లి పడుకున్నాడు. ఆదివారం ఉదయం 7 గంటల వరకూ అతను లేవకపోవడంతో తల్లి సన్యాసమ్మ లేపడానికి వెళ్లింది. తలుపులు లోపల గడియ పెట్టి ఉన్నాయి. బలవంతంగా తలుపులు తెరచి చూడగా కొడుకు డోరు కర్టెన్‌తో ఉరి వేసుకుని ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ సోమరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం శవాన్ని కేజీహెచ్‌కు తరలించి, మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

# పారిశుధ్యంపై దృష్టి సారించండి

**జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ**



పారిశుధ్యంపై అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

**డాబాగార్డెన్స్:** పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ప్రజారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం కురుపాం మార్కెట్, టౌన్‌హాల్‌రోడ్డు, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ రోడ్డు, కోటవీధి, పెరికివీధి, ఫిషింగ్‌హార్బర్, కొప్పులవీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు శానిటరీ కార్యదర్శులు పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీధుల్లో పారిశుధ్యం నిర్వహణ సరిగ్గా లేదని, కాలువలు, డ్రైన్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, రోడ్లను శుభ్రం చేసి, చెత్త పోగులు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. పారిశుధ్య కార్మికులు ఉదయం 6 గంటల నుంచి వీధుల్లో ఉండాలని, క్లాప్ వాహనాలు నిర్ణీత సమయానికే ఇంటింటి చెత్త సేకరణకు వెళ్లేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుని కాలువల్లో వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వ్యాపించకుండా ఇప్పటి నుంచే ప్రజల్లో అవగాహన కల్పిస్తూ దోమల వృద్ధిని అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన రహదారుల్లో రాత్రి పారిశుధ్య పనులు సరిగ్గా నిర్వహణ జరగడం లేదని, ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలున్నాయని, వాటిని తొలగించాలన్నారు. పర్యటనలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏఎంవోహెచ్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏయూ సమాచారం..

### జీవ సమతుల్యత బాధ్యత అందరిది



మట్టి పాత్రలు, పక్షి గూడులను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

**ఏయూ క్యాంపస్:** ప్రతి జీవిని కాపాడే బాధ్యత మానవులపై ఉందని సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ పి.ఉష పిలుపునిచ్చారు. ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ఏయూ ఆర్ట్స్ కళాశాల వద్ద వైజాగ్ ఎన్‌జీవోస్ ఫోరంతో కలసి జీవ వైవిధ్య పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పిచ్చుకల గూళ్లు, పక్షులకు నీరు పెట్టే పాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ అనేక జాతుల జీవులు అంతరించిపోతున్నాయని వాటిని సంరక్షించాల్సిందేనన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మే 22న అనేక దేశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, మనం కూడా అందులో భాగస్వాములు కావాలని విద్యార్థుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. బయోడైవర్సిటీ బోర్డ్ రీజనల్ కోఆర్డినేటర్ జానకీరామ్ మాట్లాడుతూ జీవ వైవిధ్య పరిరక్షణ మన బాధ్యత అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అంతరిస్తున్న జీవజాతులను, ప్రస్తుతం ఉన్న జీవజాతులను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత మానవాళిపై ఉందన్నారు. వైజాగ్ ఎన్‌జీవోస్ ఫోరం కార్యదర్శి ప్రజ్ఞాన్ కుమార్ మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీమ్ ప్రతినిధి జె.వి.రత్నం, సిఫా సంస్థ ప్రతినిధి భాస్కర్‌రావు, సోషల్ వర్కర్ రామ, స్వచ్ఛ ప్రియ సంస్థ ప్రతినిధి అనురాధ, సోషల్ వర్క్, ఆంత్రోపాలజీ, హిస్టరీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### రిజిస్ట్రార్‌తో నావికాదళాధికారి భేటీ



రిజిస్ట్రార్‌కు మొక్కను బహూకరిస్తున్న ఎ.పి.సింగ్

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సోమవారం వెస్టర్న్ నేవల్ కమాండ్ సీనియర్ అధికారి కమాండర్ ఎ.పి.సింగ్ సందర్శించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూతో అవగాహన ఒప్పందం చేసుకునే అంశాలపై చర్చించారు. డిఫెన్స్ ట్రైనింగ్ సెంటర్ నుంచి క్రెడిట్ బదిలీ ఆధారంగా నావికులకు బీఏ(హెచ్‌ఆర్ఎం) డిగ్రీలు అందించడం, పీజీ హెచ్‌ఆర్ఎం డిగ్రీలను అందించే దిశగా చర్చించారు. మాజీ సైనికోద్యోగులకు పునరావాస కల్పనకు ఈ డిగ్రీలు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు. అదే విధంగా లాటరెల్ ఎంట్రీ విధానంలో బీటెక్ కోర్సులు చేసేలా సాధ్యాసాధ్యాలను చర్చించారు. ఏయూతో భారత నావికాదళం అనుబంధం ఎంతో విశిష్టమైనదన్నారు. సైనికోద్యోగుల ఉన్నత విద్య లక్ష్యాలను నెరవేర్చడంలో ఏయూ అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉజ్వల్ కుమార్ ఘటక్, తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణ హితంగా వర్సిటీ ప్రాంగణం



మొక్క నాటుతున్న వీసీ ప్రసాదరెడ్డి

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని పర్యావరణహితంగా మలచాలని వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సూచించారు. సోమవారం ఉదయం ఏయూ హార్టికల్చర్ విభాగంలో ఔషధ, అలంకరణ, నీడనిచ్చే మొక్కల పెంపకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వర్సిటీ అధికారులతో కలసి మొక్కలు నాటారు. వర్షాకాలం ప్రారంభం అయ్యే సమయానికి వర్సిటీలో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని సూచించారు. పక్షులకు ఆశ్రయం ఇస్తూ, ఆహ్లాదాన్ని పంచే మొక్కలను పెంచడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భవనాలకు సమీపంలో కాకుండా దూరంగా మొక్కలను నాటాలని సూచించారు. అనంతరం వర్సిటీ స్వయంగా అభివృద్ధి చేస్తున్న నర్సరీలోని పలు మొక్కలు, వాటి ప్రత్యేకతను వీసీ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎ.నరసింహారావు, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, బ్యూటిఫికేషన్ విభాగం గౌరవ సంచాలకులు డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ జె.ప్రకాశరావు, శ్రీధర్‌బాబు, డాక్టర్ టి.షారోన్‌రాజు, ఎన్.ఎ.డి.పాల్ తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ డిమాండ్

### ప్రమాదకరంగా యూజీడీ మ్యాన్‌హోల్



శివాజీపాలెం సాయిబాబా గుడి వద్ద గొయ్యిలా ఉన్న మ్యాన్‌హోల్

**మద్దిలపాలెం :** జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెం ప్రధాన రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లే మార్గంలో సాయిబాబా గుడి పక్కన యూజీడీ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. ఈ మ్యాన్‌హోల్ వద్ద కొత్తగా రోడ్డు వేయడంతో ఇది గోతులోకి వెళ్లిపోయింది. దీంతో రహదారి మధ్యలో గొయ్యిలా తయారైంది. ఏమాత్రం ఏమరుపాటుగా వాహనాలు నడిపినా ప్రమాదాల బారిన పడాల్సి వస్తోంది. తక్షణమే మ్యాన్‌హోల్ ఎత్తు పెంచాలి.

– కె.శ్రీనివాసరావు, పిఠాపురం కాలనీ

### పూడిక తీసి వదిలేశారు!



శివాజీపాలెం గెడ్డలో తీసిన పూడిక

**మద్దిలపాలెం:** జీవీఎంసీ 22వ వార్డు శివాజీ పార్కుకు వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని గెడ్డలో ఇటీవల పూడిక తీశారు. అనంతరం రోడ్డు పక్కన కుప్పలుగా వేశారు. అవి ఎండిపోయి చెల్లాచెదురు కావడంతో ఆ ప్రాంతం అధ్వానంగా తయారైంది. దుర్వాసన వెదజల్లుతోంది. వెంటనే చెత్త కుప్పలు తొలగించాలి.

– పి.వి.రమణమూర్తి, శివాజీపాలెం

# వేడి తారులో జారిపడి డ్రైవర్ మృతి

- మృతుడిది విశాఖపట్నం

**రాయగడ:** వేడి తారులో ప్రమాదావశాతు కాలు జారి పడిన ఘటనలో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. మృతుడు విశాఖపట్నానికి చెందిన ఎ.కృష్ణారావు(42)గా గుర్తించారు. జిల్లాలోని బిసంకటక్ సమితి దుర్గి పంచాయతీ పరిధి బొంధుగుడ గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొంధుగుడ గ్రామంలో రహదారి నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో విశాఖపట్నం నుంచి వచ్చిన లారీలోని తారును హాట్‌మిక్సర్ ప్లాంట్‌లో వేసేందుకు డ్రైవర్ కృష్ణారావు వాహనం పైకి ఎక్కాడు. వాల్‌ను తిప్పుతున్న సమయంలో కాలు జారడంతో హాట్ మిక్సర్‌ప్లాంట్(తారును వేడి చేసే యంత్రం)లో ప్రమాదావశాతు పడిపోయాడు. దీంతో అక్కడిక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల వారు రక్షించేందుకు ప్రయత్నించినా.. ప్రయోజనం లేకపోయింది. వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించగా, బిసంకటక్‌కు చెందిన సిబ్బంది దాదాపు 2గంటలు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సామాజిక ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, మృతుడి బంధువులకు సమాచారం అందించారు.